# క్రికెట్ కోలాహలం ! - by తింగరి టీజీగాడు

Back Home

ఈ పేజీని పంపండి

క్రికెట్ మ్యాచ్ అంటే చాలు మొత్తం ఇండియా అంతా హోరెత్తిపోతుంది. అదీ ఇండియా పాకిస్తాన్ మధ్య మ్యాచ్ అంటే ఇంకంతే! దద్దరిల్లిపోతుంది అనటంలో సందేహం వలదు. ఫుట్ బాల్, హాకి, టెన్నిస్ వంటి మిగితా ఆటలకు ఆదరణ వున్నా క్రికెట్ కి వున్నంత లేదు అని చెప్పోచ్చు.

ఇండియా నుంచి అమెరికా రావటంలో చాలా మిస్ అయ్యాం. అందులో క్రికెట్ ఒకటి. కాని ప్రస్తుత కంప్యుటర్ యుగంలో అన్నీ దాదాపు సాధ్యమే. ఇంటర్నెట్, డిష్ ల పుణ్యమా అని క్రికెట్ ని ప్రపంచంలో ఏ మూలాన వున్నా చూడగలుగుతున్నాం. గతంలో డల్లాస్ లో థియేటర్లో ఒక మ్యాచ్ చూసాం. థియేటరంతా అద్దిరిపోయింది. పళ్ళాలు, గరిటలు తీసుకొని వచ్చి వాటితా చెవులకు పరీక్ష పెట్టారు. ఇంట్లో చూసే ఆనందం వేరు ఇలా చూడటం వేరు. రెంటికి రెండు సరి థీటు!

వరల్డ్ కప్ తర్వాత ఇండియా యువ జట్టుపై చాలా మందికి గురి కుదిరింది. గత వారం అంతా ఇండియా పాకిస్తాన్ మ్యాచ్ లతో గడిచిపోయింది. ఇండియా కష్టపడి సీరిస్ ని 2-2 తో సమం చేసింది. ఇక ఐదవ మ్యాచ్ ఫైనల్ మ్యాచ్ టైప్ లో సెట్ అయ్యింది. మనవారికి ఫైనల్స్ అంటే ఎక్కడలేని టెన్షన్ మనకి ఏమో పరేషాన్! అసలే మొదటి మ్యచ్ లో గుండెలు ఆగినంత పని అయింది!

ఇలా అనుకుంటూ .. ఆఫీస్ నుంచి మన మెస్ అయిన McDonalds కి వెళ్ళి సాండ్ విచ్ లు తీసుకొని ఇంటికి వెళ్ళి ప్రవీణ్ కి ఫోన్ చేసి ఇంకో అరగంట లో వస్తానని చెప్పి గంట తర్వాత వెళ్ళా. తలుపు తట్టి చూస్తే గురుడు చల్లగా పడుకున్నాడు! నన్ను చూసి టైమ్ అడిగి మ్యాచ్ కి పావుగంట ముందు నిదురలేపు అని చెప్పి పడుకున్నాడు. ఇంతలో దోస్త్ లను పరేషాన్ చేద్దాం అని వాళ్ళకి ఫోన్ చేస్తే గాళ్ళు నన్ను పరేషాన్ చేసిండ్రు. వాళ్ళని తిట్టి, నన్ను తిట్టుకొని, నిద్రపోతున్న ప్రవీణ్ ని కూడ తిడదాం అనుకున్నా! అంతలో ప్రవీణ్ గభాల్న లేచి మ్యాచ్ పెట్టిండు.

చూస్తే మన సిద్దయ్య (మాజీ క్రికెటర్, ప్రస్తుతం కామెంటేటర్ సిద్ధు) కామెంట్రి! సిద్దయ్య భలేటోడు! మన సామెతలు మక్కీకి మక్కీ Nescafe చేసి ఇస్తాడు. మనోడి జలక్కులతో ఒక సైట్ కూడా వుంది! "Minds are like parachutes .. they don't function until they open" ఇలాంటివి చెప్పి నవ్విస్తుంటాడు. గది గానికి తెల్సోతెల్వదో గానీ.. TV వారికీ, మనకీ తెలుసు! ఈసారి ఏం చెప్తాడో అని చూస్తే.. "The thicker the berry the sweeter the juice" అనిండు!! అంతే దొర్లుడే దొర్లుడు! మన షర్ట్ ఖరాబ్ అయ్యింది, ప్రవీణ్ ఫ్లోర్ క్లీన్ అయ్యింది!

సిద్దయ్య కామెంట్రీకి పక్కన వున్న ఇమ్రాన్ ఖాన్ బుర్రలో ఫ్లడ్ లైట్లు వెలిగినై. మంజ్రేకర్ మామ ఏమో బ్రేక్ కి టైమ్ అయ్యింది అంటే సిద్దయ్య ఏమో "లే .. నేనో ఇషయం చెప్పాలే" అని మూడు ఇషయాలు, నాలుగు సామెతలు చెప్పిండు.

టాస్ వేసిండ్రు. గంగన్న అంపైర్ మామ ఫైర్ అవుతాడేమో అని ముచ్చటగా ఐదో సారి టాస్ వోడిపోయిండు! ఇంజి ఇండియా కి బ్యాటింగ్ ఇచ్చిండు. హమ్మయ్యా ఇండియా బ్యాటింగ్ చూసి తొంగో వొచ్చు అనుకున్నా. వీక్ డే అవ్వటంతో ప్రవీణ్ ఫ్రెండ్స్ రాలేదు. రూమ్మేట్ రమాకాంత్ జాయిన్ అయ్యాడు. మ్యాచ్ షురూ అయ్యింది.

"నువ్వు వెయ్యి నేన్ కోడతా" అనేట్టు సెహ్వాగ్ మామ కొట్టుడు మొదలు పెట్టిండు. సచిన్ మామ ఏమో చిన్నగా చూసి కొట్టడం మొదలుపెట్టిండు. స్కోర్ బాగుంది అనుకున్నంతలో సెహ్వాగ్ చెత్త షాట్ కి అవుట్ అయ్యాడు. లచ్చి మామ వొచ్చిరాగానే మోదటి బాల్ ఫోర్ కొట్టిండు. సచిన్ కొద్దిసేపు బాగా ఫోర్లు కొట్టాడు .. మళ్ళీ అతి జాగ్రత్తగా కనపడిండు! కోద్దిసేపటిలో సచిన్ మామ కూడా అవుట్ అయ్యిండు. చెత్త షాటు!

"ఎక్కడ యేలెగ్గ (అదేనండీ Iron Leg) మ్యాచ్ చూస్తుందో ఏంటో!!" అనుకున్నా! అంతా నన్ను చూడటం తో సైలెంట్ అయ్యా!

గంగన్న వొచ్చిండు! మంచి షాట్లు కొట్టాడు కాని.. ఆఫ్ సైడ్ బంతులను ఆడటంలో ఇబ్బది పడ్డాడు. ఇంజి మరియు మియందాద్ లు బౌలెర్ల నడ్డి విరక్కొట్టినట్టున్నారు. అంతా గుడ్ లైన్ అండ్ లేంగ్త్ బౌలింగ్ వేసారు. ప్రవీణ్, రమాకాంత్ నిద్రలోకి జారుకున్నారు!

ఇంకో పక్క లచ్చిమామ ఎవరూ చూడకుండా చిన్నగా ఫిఫ్టి కొట్టేసాడు. లచ్చిమామ ఫిఫ్టి కొట్టిన గత ఐదు ఇన్నింగ్స్ లలో సెంచరి కొట్టిండంట! ఫిఫ్టి తర్వాత లచ్చిమామ ఇచ్చిన క్యాచ్ తాఫిక్ ఉమర్ వోదిలేసాడు! ఒక రన్నౌట్ కూడా మిస్ అయ్యింది. "ఈ రోజు లచ్చిమామ సుడి కా జవాబ్ నహి!!" అనుకున్నా.

అంతలో ఆఫ్ సైడ్ బాడిలైన్ బంతులకు ఇబ్బంది పడుతున్న గంగన్న అలాంటి ఒక బంతికే అవుట్ అయ్యాడు! గంగన్న డిటెర్మైండ్ ఇన్నింగ్స్ చూసి షోయబ్ మాలిక్ కు సిక్సులు కొట్టి చుక్కలు చూపుతాడు అనుకున్నా కాని ఇలా అవుట్ అవుతాడు అనుకోలే! గంగన్న చాలా కోపంగా వెళ్ళిపోయిండు!

తర్వాత వొచ్చిన ద్రవిడ్ కు హిట్టింగ్ చెయ్యాలో లేక నెమ్మదిగా సిలదొక్కుకోవాలో అర్థం కాక కన్ ఫ్యూస్ అయ్యిండు! ఆ confusion లో ఒక చెత్త షాట్ కి బౌల్డ్ అయ్యిండు!

యువరాజ్ వచ్చి కొన్ని మంచి షాట్స్ ఆడాడు. కాని లెగ్ ఫ్లిక్ చెయ్యబోయి అవుట్ అయ్యడు! 300 స్కోర్ చెయ్యల్సిన పిచ్ లో ఇండియా 250 చేసేలా కనపడింది. కైఫ్ వొచ్చి స్కోర్ కొంచెం లాగించాడు. లచ్చిమామ నెమ్మదిగా సెంచరీకి దగ్గర అయ్యిండు! సెంచరి దగ్గర బాల్స్ మింగకుండా చాలా బాగా ఆడాడు. ఒక మంచి లేట్ కట్ తొ 99 చేరి, సింగిల్ తీసి ఖుషి ఖుషీ అయ్యిండు. లచ్చి మామ సెంచరి చూసి శైలజ అత్తమ్మ కూడా ఖుషి అయ్యింటుంది!

స్లాగ్ ఓవర్స్ వచ్చాయి. లచ్చిమామ స్ట్రైక్ ప్లే ఆడగలడు కాని రన్నింగ్ మరియు లాఫ్టింగ్ చెయ్యలేడు. జరా పీకు అందులో. కైఫ్ ఏమో 1s ని 2s గా చెయ్యటం లో దిట్ట కానీ సిక్సులు కొట్టలేడు అని నా అభిప్రాయం. ఇద్దరూ బిగ్ షాట్స్ కొట్టబోయి అవుట్ అయ్యారు. 270 చేస్తారు అనుకున్నా.

పఠాన్ మరియూ బాలాజి వొచ్చిండ్రు. పఠాన్ ఇండియాకు మంచి ఆల్ రౌండర్ అని రాబిన్ సింగో ఇంకెవరో U-19 కోచ్ చెప్పారు. గత కొన్ని మ్యాచ్ లు చూసి అది నిజం అనిపించింది. దానిని ఈ రోజు ఋజువు చేసాడు. లాస్ట్ మ్యాచ్ లో బాలాజి సామిని బ్యూటిఫుల్ సిక్స్ కొట్టడం గుడ్డిలో మెల్ల షాట్ అనుకున్నా.. కాని అది తప్పు అని ఈ రోజు ఋజువు చేసాడు. ఇద్దరు పిచ్చ పిచ్చ షాట్స్ కొట్టారు.

ఈ గోలకి ప్రవీణ్ లేచి మ్యాచ్ చూడటం మొదలు పెట్టిండు. షోయబ్ బౌలింగ్ లో బాలాజి దిమ్మ తిరిగి పోయే సిక్స్ కొట్టాడు. షోయబ్ కి గోల్ గోల్ గోపిందం కనపడివుంటాడు! కసి కొద్దీ పిసిరాడు.. సారి.. బౌల్ చేసాడు ;-) .. అంతే! బాలాజీ బ్యాట్ పిరిగిపోయింది! (మ్యాచ్ తర్వాత ఆ బ్యాట్ మీద మన టీమ్ అంతా ఆటోగ్రాఫ్ ఇచ్చారంట!) ఇంత జరిగినా బాలాజీ ఆ బాల్ కి రెండు పరుగులు తీసి అదే నవ్వు మొఖం పెట్టాడు. మన వాడిది *ఆలీ* నవ్వు!!

ఇలా షోయబ్ ని వుతికి ఆరబెట్టి వాడి కాడ 25 గుంజుకున్నారు లాస్ట్ 2 ఓవర్స్ లో. ఇండియా 293 చేసింది.

నేను బ్రేక్ టైమ్ లో కునుకు తీసా. "యుహానా అవుట్!!" అన్న అరుపుతో మేలుకొని చూస్తే.. ఇన్నింగ్స్ స్టార్ట్ అయిపోయింది.
ర్

ఎండో పికెట్ కూడా పడిపోయింది. ముందే సిద్ర లేపనందుకు ప్రవీణ్ ని నాలుగు పీకుదాం అనుకున్నా.. కాని మనం తనలా జిమ్ము కి వెళ్ళటం లేదు అని గుర్తువొచ్చి.. క్షమించేసా!

మరుసటి ఒవర్లో బాలాజీని తఫిక్ ఉమర్ పిరగ బాదుడు! ఆ ఒవర్లో మూడు ఫోర్లు!! కానీ మళ్ళీ పఠాన్ వచ్చి కంట్రోల్ చేసాడు. ఆ తర్వాత తెలివిగా బౌల్ చేసి ఉమర్ ని బౌల్డ్ చేసాడు. తర్వాత వచ్చిన యూనస్ ఖాన్ ని బొల్తాకొట్టించాడు. రేపు ఈనాడు లో "పఠాన్ ధాటికి పాక్ పతనం!!" అని హెడ్డింగ్ వుంటుంది అనుకున్నా.

ప్రవీణ్ మళ్ళీ కునుకు వేసాడు. ఇంజి మరియు షోయబ్ మాలిక్ స్కోర్ ని సిదానముగా ముందుకు పొనిచ్చారు. వున్నట్టుండి కార్తిక్ బౌలింగ్ లో ఇంజి పెద్ద షాట్ కొట్టాడు.. "చితకబాదుడు మొదలు అయ్యిందిరో" అనుకునేంతలో.. ఎక్కడనుండో మన బుల్లోడు.. సచిన్ మామ వచ్చి అద్భుతమైన క్యాచ్ పట్టాడు.

"హుర్రే!!" అని అరిచి ప్రవీణ్ కి మేలుకొలుపు పాడా.. తను లేచి చూడటం మొదలుపెట్టాడు.

కొంతసేపటికి పిచ్చి కొట్టుడు రజాక్ ని సెహ్వాగ్ షార్ప్ క్యాచ్ పట్టి అవుట్ చేసాడు. 96/6. రాంబో రమీజ్ మరియు సొల్లు సంజయ్ ల కామెంట్రీ వినే ఓపిక లేక .. ఎట్లా మనోళ్ళు గెలుస్తారు అని .. ఇంకొద్ది సేపట్లో ఆఫీస్ టైమ్ అవుతుంది అని .. కునుకు వేసా.

"షోయబ్ అవుట్!!" అన్న అరుపుతో .. దేవకన్యతో విహరిస్తున్న నేను ఈ లోకం లోకి వచ్చా.

ఏంటి ప్రవీణ్ ఇంత ఖుషి అయ్యిండు అని చూస్తే.. పాక్ స్కోర్ 195/7!!

మన వాళ్ళు షోయబ్ మాలిక్ కి కూడా చద్ది అన్నం మూట కట్టినట్టు 60+ పరుగులు మూట కట్టి ఇచ్చారు!! ఇంకో పది పరక ఒవర్లలో 90+ పరుగులు! "కెవ్వ్ కెవ్వ్ కెవ్వ్" అని నిద్ర మత్తు వొదలి లేచి కూర్చున్నా.

సామి వచ్చి చితకబాదిండు! మన జహీర్ ఖాన్ ఒక మంచి ఓవర్ వేసి కంట్రోల్ చేసిండు. మళ్ళీ తన మరుసటి ఓవర్లో సామి ని క్లీన్ బౌల్డ్ చేసిండు. మంచి యార్కర్! బాలాజి సిక్సర్ తో కళ్ళు బైర్లు కమ్మిన షోయబ్ అఖ్తర్ ఎలా పరుగెట్టాలో తెలియక రనౌట్ అయ్యాడు! తర్వాత బాలాజి మోయిన్ ఖాన్ ను యార్క్ వేసి బౌల్డ్ చేసి మ్యాచ్ ముగించాడు.

"హమ్మయ్యా !!!" అనుకొని.. ఇంక ఆఫీస్ టైమ్ అవుతోంది.. ఇంటికి వెళ్ళి రెడీ అవ్వాలి అని ప్రవీణ్ కి చెప్పి, నా బుల్లి కారు లో ఇంటి మొఖం పట్టాను.

---

మీ సూచనలూ సలహాలూ రచయిత తింగరి టీజీగాడు కి తెలియపరచండి.